సింగరేణి స్విమ్మింగ్ పూల్‌కు తాళం

- కోచ్ లేక నిలిచిన స్విమ్మింగ్
- ఉన్న కోచ్ గనికి బదిలీ
- కొద్ది రోజులుగా ఎదురుచూపులు
- ఫీజు చెల్లించిన వారికి ప్రాక్టీస్ నిల్
- సీఈఆర్ క్లబ్ తెరుచుకునేదెన్నడో!

సింగరేణి స్విమ్మింగ్ పూల్, (ఇన్‌సెట్‌లో) మూసివేసిన గేటు

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వ్యాయామం అందని ద్రాక్షలా మారింది. సింగరేణి యాజమాన్యం సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రతి ఏరియాలో స్విమ్మింగ్ పూల్‌లను, సీఈఆర్ (కాలరీస్ ఎంప్లాయీస్ రిక్రియేషన్) క్లబ్‌లను ఏర్పాటు చేసింది. కోచ్‌లను నియమించి వ్యాయామం, స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపుతుంది. ఈ క్రమంలో స్విమ్మింగ్, ఇతర క్రీడల్లో జాతీయస్థాయిలో పతకాలను ఎంతోమంది సాధించారు. కానీ కాలక్రమంలో అవన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం భూపాలపల్లి ఏరియాలోని స్విమ్మింగ్ పూల్‌లు, సీఈఆర్ క్లబ్‌లు మూతపడ్డాయి. సీఈఆర్ క్లబ్‌లో ఈవీఎంలు భద్రపరచడంతో క్లబ్ ఉపయోగంలో లేకుండా పోయింది. కాగా స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న కోచ్‌ను అధికారులు గనికి బదిలీ చేయడంతో కోచ్ లేక 15రోజులుగా స్విమ్మింగ్ పూల్ తాళం వేసి ఉంటోంది. ఏరియాలో సేవా, కమ్యూనికేషన్ కోఆర్డినేటర్లను సైతం గనుల్లోకి దింపడంతో సేవా, కమ్యూనిటీ సెల్‌లలో కార్యకలాపాలు నిలిచాయి.

స్విమ్మింగ్ బంద్

భూపాలపల్లి ఏరియాలోని క్రిష్ణాకాలనీలో సీఈఆర్ క్లబ్ పక్కనే అంబేద్కర్ స్టేడియంలో, బంగ్లా ఏరియాలో సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం రెండు స్విమ్మింగ్ పూల్‌లను ఏర్పాటు చేసింది. కార్మికుల్లో అర్హులైన వారిని కోచ్‌గా నియమించి కార్మికులు, వారి పిల్లలకు, ఇతరులకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇప్పిస్తుంది. ఈక్రమంలో శారీరక వ్యాయామంతో పాటు ఈత పోటీలకు తర్ఫీదు పొందుతున్నారు. ఇందుకు కార్మికులకు రూ.100, కార్మికుల పిల్లలకు రూ.50, ఇతరులకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.400 మెయింటెనెన్స్ కోసం సంస్థ వసూలు చేస్తుంది. కాగా బంగ్లా ఏరియాలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు, వారి పిల్లలు ఉపయోగించుకుంటుండగా అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో సింగరేణి కార్మికులు, వారి పిల్లలతోపాటు ఇతరులు రోజూ సుమారు 100 మంది ఉదయం, సాయంత్రం స్విమ్మింగ్ చేస్తున్నారు. సింగరేణిలోని ఇతర ఏరియాల్లో స్విమ్మింగ్ కోచ్‌లకు ప్లే డేలు ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం ప్లే డేలు ఇవ్వకపోవడంతో గతంలో ఉన్న కోచ్ ఓసీకి వెళ్లిపోయాడని, ప్రస్తుతం పనిచేస్తున్న కోచ్‌ను గనికి బదిలీ చేశారని కార్మికులు పేర్కొంటున్నారు. దీంతో కొద్ది రోజులుగా స్విమ్మింగ్ పూల్ మూతపడడంతో కార్మిక కుటుంబాలతోపాటు ఫీజు చెల్లించిన ఇతరులు సైతం స్విమ్మింగ్‌కు దూరమవుతున్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేశాం

ఏరియాలో కొనసాగుతున్న డిప్యుటేషన్లు డైరెక్టర్ ఆదేశాల మేరకు జీఎం రద్దు చేశారు. స్విమ్మింగ్ కోచ్, సేవా, కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్స్ డిప్యూటేషన్‌లను క్యాన్సిల్ చేశాం. వాళ్ల పనుల్లోకి పంపించాం. శాశ్వత నియామకాల కోసం కార్పొరేట్‌కు ప్రతిపాదనలు పంపాం. అప్రూవల్ రాగానే స్విమ్మింగ్ పూల్ కోచ్, సేవా, కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్స్‌ను నియమిస్తాం. సీఈఆర్ క్లబ్‌లో ఈవీఎంలు తీసుకెళ్లారు. ర్యాక్‌లు ఉన్నాయి. అవి కూడా తీయాలని కోరాం.

– తుకారాం, ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి

క్లబ్‌కు మోక్షమెప్పుడో..

కార్మికులకు, కార్మికుల పిల్లల వ్యాయామం కోసం సింగరేణి యాజమాన్యం సీఈఆర్ క్లబ్‌లను ఏర్పాటు చేసింది. క్లబ్‌లలో వ్యాయామ పరికరాలు, క్యారం, చెస్, టేబుల్ టెన్నిస్, జిమ్, లాన్ టెన్నిస్ ఏర్పాటు చేశారు. క్లబ్ గదుల్లో ఈవీఎంలను భద్రపరచడంతో నాలుగేళ్లుగా మూతపడింది. అనంతరం కొంతకాలం క్లబ్ ఉపయోగంలోకి వచ్చినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ మూసేశారు. ఈవీఎంలను ఇతర భవనాల్లోకి మార్చి క్లబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని కార్మికసంఘాల డిమాండ్‌ను పట్టించుకోలేదు. క్లబ్‌లో 2వేల మంది కార్మికులు సభ్యులుగా ఉండగా, వారి నుంచి నెలకు రూ.10 చొప్పున తీసుకుంటున్నారు. నెలకు రూ.20వేలు క్లబ్ ఖాతాలో ఉంటున్నాయి. క్లబ్ మాత్రం కార్మికులకు ఉపయోగపడడం లేదు. త్వరలో కోలిండియా స్థాయి క్రీడలు ఉన్నాయి. వాటికి ఎలా సన్నద్ధం కావాలో తెలియడం లేదని సింగరేణి క్రీడాకారులు వాపోతున్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసం
- శుభ ముహూర్తాలు షురూ.. మోగనున్న భాజాభజంత్రీలు
- ప్రత్యేక పూజలకు ఆలయాలు సిద్ధం

పోచమ్మమైదాన్, ఆగస్టు 3: శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానముంది. వివాహాది శుభకార్యాలకు అనువైన మాసం. మూడు నెలల నుంచి ఆగిపోయిన శుభ ముహూర్తాలు ఆరంభం కానున్నాయి. సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమై సెప్టెంబర్ 3తో ముగియనుంది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర శుభ కార్యాలకు ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకుని ఫంక్షన్ హాళ్లు బుక్ చేసుకున్నారు. ఆగస్టు నెలలో మాత్రమే వివాహాలు ఉండడంతో పెద్ద ఎత్తున భాజాభజంత్రీలు మోగనున్నాయి.

ముహూర్తాలివే..

ఆగస్టు 6, 8, 9, 10, 11, 15,17,18, 22, 23, 24, 28, 30 తేదీల్లో మాత్రమే వివాహాలకు శుభ ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. నెలలో 13 రోజులు మాత్రమే మంచి రోజులు ఉండడంతో ముహూర్తాలు పెట్టుకుని రెడీగా ఉన్నారు. పవిత్రంగా భావించే శ్రావణ మాసంలో నెల రోజులపాటు ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. మహిళలు ప్రతి రోజూ అమ్మవారిని పూజిస్తారు. కొన్ని కుటుంబాల్లో నాన్ వెజ్ జోలికి వెళ్లకుండా శాఖాహారమే తింటారు.

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

లక్ష్మణ్‌కు సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ మధు

గోవిందరావుపేట, ఆగస్టు 4 : స్పృహతప్పి పడిపోయిన వ్యక్తికి సీపీఆర్ చేసినప్పటికీ కోలుకోలేదు. మండలంలోని పస్రాకు చెందిన కూలీ గట్టం లక్ష్మణ్(60) ఆదివారం సాయంత్రం చౌరస్తాలో స్పృహతప్పి పడిపోయాడు. మంత్రి సీతక్క పర్యటనలో భాగంగా బందోబస్తులో ఉన్న ఎస్సై గన్‌మెన్ మధు, మరో కానిస్టేబుల్ మధు అతడికి సీపీఆర్ చేసి స్వాస అందించారు. వెంటనే కోలుకోవడంతో అతడిని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించడంతో ఒంటిగంట సమయంలో మళ్లీ స్పృహ కోల్పోయాడు. వెంటనే చికిత్స కోసం 108లో ములుగు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిసింది.

పేదరికం.. కాటికి తీసుకెళ్ల లేని దైన్యం

- గ్రామస్తులు చందాలు వేసుకొని అంత్యక్రియలు
- ఇంటి పెద్ద మృతితో ఆదుకోవాలంటున్న కుటుంబసభ్యులు

పూరిగుడిసె ఎదుట మృతుడి భార్య, ఇద్దరు కుమారులు

ములుగురూరల్, ఆగస్టు 4 : అనారోగ్యంతో ఇంటి పెద్ద మృతి చెందగా, కడు పేదరికంలో ఆ కుటుంబం కాటికి తీసుకెళ్లలేని దీనస్థితిలో ఉన్నది. దీంతో గ్రామస్తులంతా చందాలు వేసుకొని అంత్యక్రియలు చేసిన ములు గు మండలం జంగాలపల్లి గ్రామంలో ఆలస్యం గా వెలుగు చేసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పెండెల రవి(48) గత నెల 31న జ్వరం బారిన పడగా ములుగు ప్రభుత్వ దవాఖానకు చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఆగస్టు 2న ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతదేహాన్ని శుక్రవారం ప్రభుత్వ వాహనంలో గ్రామానికి తీసుకురాగా, దహన సంస్కారాలు నిర్వహించేందుకు మృతుడి కుటుంబసభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సుమారు 50మంది రూ.100 చొప్పున చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉండగా, వారు కుటుంబ పోషణ లేక దిక్కులేని వారయ్యారు. ప్రస్తుతం ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. దాతలతోపాటు ప్రభుత్వం కూడా సహకారం అందించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓరుగల్లుకు కొండా లక్ష్మణ్ అవార్డులు

కొత్తవాడలో ఇద్దరు నేతన్నలు, మహదేవపూర్‌లో ఒకరికి..

సహజ సిద్ధమైన రంగులతో నేసిన బూటా చీర చూపుతున్న గోరంట్ల శ్రీనివాస్

దర్బ్రస్‌పై గాంధీ చిత్రపటంతో చేనేత కార్మికుడు అడెపు శ్రీనివాస్, రేవంత్ రెడ్డి చిత్రపటంతో చేనేత కార్మికుడు సామల సదానందం

పోచమ్మమైదాన్/మహదేవపూర్, ఆగస్టు4: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందజేయనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డులను ఉమ్మడి జిల్లాలో ముగ్గురు నేతన్నలు దక్కించుకున్నారు. వీరు ఆగస్టు 7న హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్డులో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు. దర్బ్రస్‌పై కొత్తవాడకు చెందిన ఆడెపు శ్రీనివాస్ మహాత్మాగాంధీ, తుమ్మల కుంటకు చెందిన సామల సదానందం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం నేశారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని టస్సార్ కాలనీకి చెందిన గోరంటల శ్రీనివాస్ పర్యావరణ హిత మైన రంగులతో బూటాతో కూడిన టసర్ పట్టుచీరను తయారుచేశాడు. ఇందులో ఆడెపు శ్రీనివాస్ నలభై ఏళ్లుగా వివిధ రకాల డిజైన్లను తయారుచేస్తూ, జాతీయస్థాయి అవార్డు కోసం దర్బ్రస్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిత్రాన్ని నేసి పోటీ పడ్డాడు. సదానందం 35 ఏళ్ల నుంచి ఉత్పత్తులను నేస్తూ ప్రశంసలు అందుకున్నాడు. గోరంట్ల శ్రీనివాస్ ప్రత్యేకంగా ప్రకృతి సిద్ధ కోతి మీర, పూదీన, ఇతర పూలతో రంగులను వినియోగించి నేసిన బూటా చీరకు గుర్తింపు లభించింది. కాగా ఈ అవార్డు కింద నేతన్నలకు ప్రభుత్వం సన్మానంతో పాటు రూ.25వేల నగదు పారితోషికం, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేయనుంది. ఈ సందర్భంగా అవార్డులు రావడంపై చేనేత కార్మికులను టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అభినందించారు.

రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి

- మహ్మద్ సిరాజ్ గ్రూప్-1 ఉద్యోగం అడిగారా..?
- క్రీడా మంత్రి పదవి ఇచ్చుకో..: టీఎస్ఎఫ్, డీఎంఎస్ఏ

హనుమకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సునీల్, నరేశ్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 4 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ సాక్షిగా ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించడంపై ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో టీఎస్ఎఫ్, డీఎంఎస్ఏ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్ మాట్లాడుతూ.. విద్యార్హతలు లేకపోయినా ఉద్యోగం ఇస్తామని స్వయంగా రాష్ట్ర సీఎం చెప్పడం అన్యాయమని, ఇది విద్యార్థి నిరుద్యోగులను అవమానించడమేనన్నారు. వెంటనే నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం డిగ్రీ పాస్ కాకపోయినా, ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోకపోయినా ఉద్యోగం ఇవ్వడం ఎలా సమంజసమని ప్రశ్నిస్తూ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని ఏ అధికరణ ముఖ్యమంత్రికి గ్రూప్ -1 ఉద్యోగం ఇచ్చే అవకాశం కల్పించిందని నిలదీశారు. అవసరమైతే సిరాజ్, నిఖత్ జరీన్‌కు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమించాలని, అవసరమైతే ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి గౌరవించాలని, స్పోర్ట్స్ అంబాసిడర్‌గా నియమించాలన్నారు. నగదు బహుమతులు, ఇళ్లు ఇవ్వడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ, వేల రూపాయలు ఖర్చుపెట్టి, ఏళ్లతరబడి చదువుకునే నిరుద్యోగుల నోట్లో మన్నుకొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. సిరాజ్, నిఖత్ జరీన్ తమకు ఉద్యోగం కావాలని ముఖ్యమంత్రిని అడగలేదని, ఉద్యోగం చేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారో లేదో కూడా అడగకుండా ఎలా ఇస్తారన్నారు. ఈ అభ్యర్థనను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించి వెంటనే ప్రభుత్వ వివరణ కోరి, గ్రూప్-1 ఉద్యోగాలను వెనక్కి తీసుకొని అర్హులైన, పరీక్ష రాసిన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ఏ, టీఎస్ఎఫ్ నాయకులు తాగూర్, వెంకట్, నాని, మోహన్ పాల్గొన్నారు.

రుణానికి బీమా రక్ష

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..



గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు.

గుర్తుంచుకోండి..

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో-అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్-యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

బీమాలో రకాలు..

హైబ్రిడ్ ప్లాన్లు

హైబ్రిడ్ కవర్ ప్లాన్లలో బీమా కవరేజీ మొత్తం తొలి ఏడాది స్థిరంగా ఉంటుంది. అయితే రెండో ఏడాది నుంచి క్రమేణా కవరేజీ తగ్గిపోతూ ఉంటుంది. గృహ రుణ బకాయి మొత్తాలు కూడా తగ్గుతుండటమే దీనికి కారణం.

లెవల్ కవర్ ప్లాన్లు

గృహ రుణం కాల వ్యవధి ఎప్పటిదాకా ఉంటుందో అప్పటిదాకా ఈ లెవల్ కవర్ ప్లాన్లలో బీమా ప్రయోజనాలు స్థిరంగా ఉంటాయి. రుణ మొత్తాలు తగ్గుతున్నంత మాత్రాన బీమా కవరేజీ తగ్గిపోదు. కాబట్టి ముందే ఆలోచించి ప్లాన్లపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

పన్ను ప్రోత్సాహకాలు ప్రయోజనాలివే..

గృహ రుణగ్రహీతలు.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద బీమా కోసం చెల్లించే ప్రీమియంలను పన్ను మినహాయింపునకు కోరవచ్చు.

కుటుంబ రక్షణ

కుటుంబ పెద్ద అకాల మరణం పాలైనప్పుడు.. గృహ రుణ భారం ఆ కుటుంబ సభ్యులపై పడకుండా హోమ్ లోన్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. కాబట్టి రుణం తీసుకున్నప్పుడు దానికి బీమా కూడా తీసుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

చివరగా.. ఇన్సూరెన్స్ ప్రీమియంలను రుణ మొత్తం, రీపేమెంట్ టెన్యూర్, రుణగ్రహీత వయస్సు, ఆరోగ్య పరిస్థితులు ప్రభావితం చేయగలవు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లో బీమా వర్తిస్తుంది. అత్యుత్తమ బీమా కవరేజీనే తీసుకుంటున్నామా? అన్నదీ పరిశీలించుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్లు, పేమెంట్ పద్ధతిని కూడా కనుక్కోవడం మంచిది.

రాబడి

క్రెడిట్ కార్డ్ కావాలా.. నాయనా!

బ్యాంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్‌లో క్రెడిట్ కార్డ్ కావాలా? అంటూ అడిగితే.. ఊ కొడుతూ వెళ్లే ముందు ఇదికాస్త ఆలోచించుకోండి. మీరు తీసుకునే క్రెడిట్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనలను పూర్తిగా చదవడం మర్చిపోవద్దు. దానిపై పొందే నగదు మొత్తాలకుపడే వడ్డీరేట్లు, ఇతర ఫీజులు, చార్జీలను తెలుసుకోకుంటే నష్టపోతారు. బ్యాంకింగ్ కస్టమర్ల ప్రయోజనార్థం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు సందేశాలను కూడా ఇస్తుండటం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్‌ను పూర్తిస్థాయిలో వాడుకోకపోవడమే మంచిది. అలాగే వాడుకున్న మొత్తాలను కొద్దికొద్దిగా చెల్లించడం కాకుండా పూర్తిగా చెల్లిస్తేనే వడ్డీభారం పడబోదని గుర్తుంచుకోవాలి.

ఒడిదొడుకులకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం వరుస లాభాల్లో కదలాడాయి. అయితే చివర్లో నష్టాలు దెబ్బతీశాయి. ఆఖరిరోజు శుక్రవారం భారీగా క్షీణించాయి. మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో ఓవరాల్‌గా గత వారం మార్కెట్లు నష్టాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 350.77 పాయింట్లు కోల్పోయి 80,981.95 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 117.15 పాయింట్లు దిగజారి 24,717.70 దగ్గర నిలిచింది. నిజానికి గత వారం తొలిసారి సెన్సెక్స్ 82,000 మార్కును, నిఫ్టీ 25,000 మార్కును దాటాయి. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు ఎక్కువగా ఆస్కారం కనిపిస్తున్నది. ఇజ్రాయెల్-హమాస్ నడుమ ఉద్రిక్తతల్ని మరింత పెంచేలా అమెరికా జోక్యం కలవరం పుట్టిస్తున్నది. అలాగే మదుపరులు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో ద్వైమాసికానికిగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించే ద్రవ్యవిధాన పరపతి సమీక్ష ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గురువారం ఆర్బీఐ తమ పాలసీని ప్రకటించనున్నది. సుదీర్ఘకాలంగా వడ్డీరేట్లపై యథాతథంగానే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతున్నది తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నది. అయితే ఇప్పటికీ ధరాఘాతం కొనసాగుతున్నది. దీంతో రాబోయే సమీక్షలో వడ్డీరేట్లపై ఆర్బీఐ ఏం నిర్ణయం తీసుకుంటుందన్నదే కీలకం. ఒకవేళ ఎప్పట్లాగే వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే సమీక్ష ముగిస్తే.. ఆటో, బ్యాంకింగ్, స్టీల్, రియల్టీ, దాని అనుబంధ రంగాల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కోవచ్చు. వడ్డీరేట్లు తగ్గితే మాత్రం ఈ రంగాల్లోని సంస్థల షేర్లన్నీ లాభాలను సంతరించుకునే వీలున్నది. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఇల్లు కొంటున్నారా?

పీఎంఏవై పథకంలో వడ్డీ రాయితీ పొందండిలా



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం మళ్లీ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024 -25)గాను గత నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో దీన్ని తిరిగి తీసుకొచ్చారు.

ఏమిటీ పీఎంఏవై?

ఈ పథకం 2015లో మొదలైంది. దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు పక్కా గృహాలు, కనీస వసతుల్ని కల్పించడమే ఈ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం లక్ష్యం. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ఇందులో పీఎంఏవై-గ్రామీణ్, పీఎంఏవై-అర్బన్ పేరిట రెండు విభాగాలున్నాయి. ఇంటి నిర్మాణం, కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీలో రాయితీ ప్రయోజనాన్ని పీఎంఏవై అందిస్తుంది.

ఎవరు అర్హులు?

- వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉన్న ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు.
- రూ.3-6 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న అల్పాదాయ వర్గాలు.
- రూ.6-12 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజానీకం.
- రూ.12-18 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న ఎగువ మధ్యతరగతి కుటుంబాలు.
- పీఎంఏవై దరఖాస్తుదారులు భారతీయులై ఉండాలి. దేశంలో మరెక్కడా వారికి సొంతిల్లు